


**బడికి వెళ్లాలంటే బస్సు తప్ప మాకు - మరో మార్గం లేని పల్లెటూళ్లో నేనూ, సుబ్బారావూ పంతుళ్లం.**

రోజూ ఎనిమిదిన్నరకంతా ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. కాంప్లెక్స్‌లో ఉంటేనే లేటు కాకుండా బడికి వెళ్లడానికి ఏదో ఒక బస్సు దొరుకుతుంది. అంతకుముందు ఒకే ఒక బస్సు ఆ రూట్‌లో - రెండు, మూడు ట్రిప్పులు మాత్రం వెళ్లేది. ఈ మధ్య 'జన్మభూమి', 'శ్రమదానం' పుణ్యమా అని మరో రెండు బస్సులు ఆ రూట్‌లో వేశారు. బస్సులైతే వేశారు కానీ, వాటి కండిషన్ షరా మామూలే. డబ్బులిచ్చి టికెట్టు కొని, బస్సు ఆగినప్పుడల్లా పాసెంజర్లంతా కలిసి బస్సును తోసిన సందర్భాలు, నాలుగు చినుకులు పడినప్పుడు లారీల వాళ్లు నసేమిరా దిగమని మొండికేస్తే చేసేది లేక రోడ్డు మార్జిన్ దిగినందున బస్సు చక్రాలు బురదలో కూరుకుపోయిన సంఘటనలు లేకపోలేదు. కాకపోతే ఇక్కడో సౌకర్యం! మార్గమధ్యం పల్లెటూరి పరిసరం కాబట్టి ఇలాంటప్పుడు కొందరు రైతులు ఎద్దులతో ఈడ్పించో, ట్రాక్టరుతో లాగించో కాసేపటికి బస్సును బయటికి తెస్తారు. ఈ విధంగా ఆ రూట్‌లో ఆర్టీసీ బస్సులు 'దినదినగండం నూరేళ్ల ఆయుష్షు'గా ప్రయాణం సాగిస్తాయి.

ఏ విధమైన ఆపూ అడ్డంకూ లేకుండా స్టాండ్‌లో కదిలిన బస్సు మా మలకపల్లి స్కూల్ దగ్గరవరకూ సాఫీగా వచ్చిందంటే చాలు, ఇక ఆ రోజు అదేమిటో పిచ్చి ఆనందం మా ముఖంలో వెలిగిపోతూ ఉంటుంది. అదే ఊళ్లో, స్కూలుకు దగ్గరలోనే మకాం ఉంటున్న మాస్టరులెవరైనా ఆ రోజు ఖర్మకాలి ఆలస్యంగా వచ్చారా! ఇక, ఆ రోజు చూడండి మా ప్రతాపం, వాళ్లపై వ్యంగ్యోక్తులు, వెటకారం నవ్వులూను. ఆ అవకాశం మాకు ఆర్టీసీ బస్సు ఎప్పుడో కానీ ఇవ్వదులెండి.

సుబ్బారావూ, నేనూ ఒకే బస్సు ఎక్కుతాము. రోజూ చేయాల్సిన ప్రయాణం కాబట్టి

# జాలిపడాల్సిన శాల్తీ

డా॥ ఎ.వి. రమణప్రసాద్

నిర్మొహమాటంగా ఎవరి టికెట్లు వాళ్లే కొంటాము. అంతేకాదు, 'టికెట్టుకు సరిపడు చిల్లర ఇచ్చి సహకరించండి!' అనే ఆర్టీసీ వాళ్ల నినాదాన్ని చిత్తశుద్ధితో అమలు జరిపేది కూడా మేమే. చిత్తశుద్ధా! గాడిదగుడ్డా! అదేం కాదు. చెబుతా వినండి, పది రూపాయల కాగితమిస్తే కండక్టరుగారు టికెట్టు వెనక ఏడు రూపాయలా డెబ్బయి పైసలు డ్యూ అని రాస్తాడు. ఇరవై ఇస్తే, పదిహేడు రూపాయలా డెబ్బై, యాభై రూపాయల నోటిస్తే నలభై ఏడు రూపాయలా డెబ్బై పైసలు డ్యూ - ఎంత పెద్ద నోటిచ్చినా ఇదే పద్ధతి. అంతవరకూ ఈ రోజు అసలు టైముకి బడికి వెళ్లగలమా? అన్న అనుమానంతో ఉన్నవాళ్లం, బస్సు కిటికీలోనుంచి బడి కనిపించేసరికి తన్నుకుంటూ వస్తున్న కంగారుతో, మతిమరుపుతో బస్సు దిగేసి, బస్సు వెళ్లిపోయాక పది అడుగులు వేసి అప్పుడు గుర్తుకొచ్చి టికెట్టు వెనకాల డ్యూ రాసిన ఏడుంకె చూస్తూ ఏడవడమే గతి! ఇలా రెండు మూడు సార్లు జరిగినందున ఇంట్లో ప్రతి వ్యక్తికీ చిల్లర కనిపిస్తే చాలు పోగుచేసి ఒక డబ్బీలో వేసి జాగ్రత్త చేసే క్రమశిక్షణను అలవాటు చేశాం. 'మలకపల్లి బస్సు ఛార్జీలు' అనే లేబుల్ అతికించిన డబ్బాలోనుంచి రోజూ నాలుగు రూపాయలా అరవై పైసలు తెచ్చుకుని బస్సెక్కేవాళ్లం. అదండీ! మేము ఖచ్చితమైన చిల్లర ఆర్టీసీవాళ్లకు ఇవ్వడానికి గల నేపథ్యం!

సుబ్బారావు అంత పెద్ద ఆరోగ్యవంతుడు కాదు. తెలివైనవాడూ కాదు. వాళ్ల అమ్మా, నాన్నలకు ఒకే ఒక కొడుకు. గారాబం వల్లనేమో, వాళ్లు ఎక్కువగా చదివించిందీ లేదు. వీడు చదివిందీ లేదు. ఎలాగో ఇంటర్ పూర్తి చేసి ఆంధ్రాలో సీటు దొరక్క, కర్ణాటకలో డొనేషన్ కట్టి వాళ్ల బంధువులింట్లో ఉండి టీచర్స్ ట్రైనింగ్ అయిందనిపించాడు. ఉపాధ్యాయుల ఖాళీలు భారీ సంఖ్యలో పూర్తి చేసే ఆశయంలో ప్రభుత్వం ఉన్నందున అదృష్టవశాత్తు సుబ్బారావుకు ఉద్యోగమూ వచ్చింది.

సుబ్బారావును చూస్తే జాలేస్తుంది కానీ, వాని పుట్టు పూర్వోత్తరాలు తెలిస్తే మాత్రం విచారం కలుగుతుంది. సుబ్బారావు ముత్తాత, ముత్తవ్వ; తాత, అవ్వ; అమ్మ, నాన్న అందరూ మేనరికం జంటలే!

శాస్త్రీయమైన వైజ్ఞానిక అవగాహన లేకపోవడం, ముఖపరిచయం లేని దూరపు సంబంధాలు, కొత్త బంధుత్వాలు ముప్పు తెస్తాయేమో అనే అకారణమైన అనుమానం, సంప్రదాయం పాటించి తీరాలనే పూర్వీకుల పట్టుదల వీటన్నింటికీ సుబ్బారావు బలి అయ్యాడేమో ననిపిస్తుంది. పారంపర్య ప్రభావం, జన్యులోప జననం వల్ల పాపం సుబ్బారావు మానసికంగా, శారీరకంగా కూడా దుర్బలుడు.

వాళ్ల కుటుంబంతో నాకున్న సాన్నిహిత్యం వల్ల, సుబ్బారావు మీద ఉండే సానుభూతి వల్ల, వాళ్లింట్లో పెద్దవాళ్లు అప్పజెప్పారనే కాదు, నా ఇష్టపూర్వకంగా కూడా నేను వాని బాధ్యతను స్వీకరించాను.

ఆమధ్య మేమిద్దరమూ లోక్‌సభ ఎన్నికల డ్యూటీకి ఇంకో ఊరు వెళ్లాం. కొత్తచోటు, లైట్లు లేవు. దోమలు. అమరీ అమరని జంట బెంచీలమీద నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్నా. అదే గదిలో ఒక మూల బల్లమీద కాండిల్ పెట్టుకుని కుర్చీలో కూర్చుని ఎవరో ఏదో పనిచేసుకుంటున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గారేమో! ఆయన కంగారుపాడుగానూ! బాలెట్ పేపర్లమీద అప్పుడే సంతకాలు పెట్టేస్తున్నాడేమో! అని అనుకుంటూనే ఒక కునుకు తీశా. ఇంతలో తట్టి లేపారెవరో. కళ్లు తెరిచా. కాండిల్ వెలుతురు నా కంటిని కుట్టేస్తోంది. ఇందాక కాండిల్‌కు అడ్డంగా కూర్చుని పనిచేసుకుంటున్న వ్యక్తి అక్కడ లేడు. చేయి కంటికి అడ్డుగా పెట్టుకుని తల కొంచెం పైకెత్తి చూస్తే సుబ్బారావు.

"ఏరా...?" అన్నాను.

"ఎల్లుండి మన స్కూలుకు ఇన్‌స్పెక్షన్ కదా! ఇంట్లో కుదరలేదు. మనకిక్కడ పోలింగ్ క్లర్క్ డ్యూటీయే కదా, అందువల్ల ఇక్కడ వీలవుతుందని తీసుకొచ్చా. టీచింగ్ నోట్సులు రాస్తున్నా. మధ్యలో చిన్న డౌటొచ్చి నిన్ను నిద్ర లేపా! అవును గురూ, ఇన్‌స్పెక్షన్‌లో మనం చెప్పే పాఠానికి లెసన్ ప్లాన్ మనకు టీచర్ ట్రైనింగ్‌లో చెప్పినట్లు రాయాలా, లేక రోజూ మనం రాస్తున్నట్లుగా ఏదో ఇంత గీకిపారేస్తే సరిపోతుందా?" తీరిగ్గా నీళ్లు నములుతూ ప్రశ్నిస్తున్నాడు సుబ్బారావు.

"ఓరి నీ ఛాదస్తం దొంగలు తోలా! ఇంత అర్ధరాత్రిలో టీచింగ్ నోట్సేమిట్రా? వెంటనే ఆ పుస్తకాలు మూసేసి నిద్రపట్టినా, పట్టకపోయినా, పడుకుని దొర్లు! తెల్లారితే చచ్చేంత పనుంటుంది!" అని గదమాయించా.

ఒక్కోసారి కసురుకుంటాను కానీ ఆ తరువాత సుబ్బారావు మానసిక అపరిపక్వతకు జాలిపడతాను.

"ఎలక్షన్ డ్యూటీకి బయలుదేరేటప్పుడు పేస్టు, బ్రష్, సబ్బు, టవలు, లుంగీ, దుప్పటి ఇవన్నీ బ్రీఫ్‌కేసులో పెట్టుకున్నావా, నాయనా! అని అడిగినవాణ్ణి టీచింగ్ నోట్సూ, మార్కుల రిజిస్టరులాంటి అనవసరమైన చెత్త రికార్డంతా వెంట తెచ్చుకోకురా సన్నాసీ! అని చెప్పానా? చెప్పలేదు. నిన్ను కాదురా అనాల్సింది, నీ తెలివితేటల్ని ముందే ఊహించనందుకు నన్ను నేను నిందించుకోవాలి!" అని నేను పొద్దటే ఒళ్లు మండి అంటూంటే...

"నిజమే మరి, నీవు ముందే చెప్పి ఉంటే ఇవన్నీ తీసుకొచ్చేవాణ్ణి కాదు కదా! రాత్రి చీకట్లో అవి ఎక్కడ పెట్టానో ఏమో కనిపించటం లేదు!" అని రాగం తీస్తూ వెళ్లిపోయాడు సుబ్బారావు. ఇంకేం చెప్పనూ, ఇదండీ మా వాడి వరస!

"పంచదార వచ్చిందట, బయటకు వెళ్లేటప్పుడు యాభై రూపాయలిచ్చి వెళ్లండి! అనక మరిచిపోతారు!" అని అంటే, "యాభై రూపాయలా! ఇప్పుడు నా దగ్గర లేవే! సాయంత్రం ఇంటికి వచ్చాక ఇస్తాలే. రేపు తెప్పించుకో! ఈ రోజు మలకపల్లి స్కూల్ విజిట్!" అంటూ మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గారు నిర్భయంగా, నిరపాయకరంగా బాత్‌రూమ్‌లోనుంచి 'నా భార్యకేగా నేను చెప్తున్నది' అనే ధీమాతో 'ఎవడు విని చస్తాడులే!' అనే నిర్లక్ష్యంతో సాక్షాత్తూ వాళ్ల ఆవిడకి సమాధానం ఇవ్వడం, తన చెవులారా విన్నదట మా అమ్మాయి. నాతో చెప్పింది. ఎం.ఇ.ఓ. గారి అమ్మాయి, మా అమ్మాయి ఇద్దరూ కలిసి రోజూ హోమ్ వర్క్ వాళ్లింట్లోనే చేసుకుంటారు. నేను వెంటనే సుబ్బారావుకి కబురు చేశా. ఈ రోజు మన స్కూల్‌కి ఎం.ఇ.ఓ. గారి విజిట్ ఉంది, వీలైనంతవరకు ముందు బస్సుకే వెళ్లిపోదామని.

యథాప్రకారంగా నల్లని జిప్ బాగు, వాటర్ బాటిలూ, టిఫిన్ బాక్సూ ఉన్న ఎర్రటి ప్లాస్టిక్ బుట్టా చేత ధరించి నాకంటే ముందే వచ్చేశాడు సుబ్బారావు.

ఇద్దరం బస్సెక్కేశాం. మామూలుగా ఎవరి టికెట్లు వాళ్లు తీసేశాం. ఇదివరకు ఐదారు నెలల క్రితం కండక్టరు టికెట్టు వెనకాల డ్యూ రాసే రోజుల్లో సుబ్బారావు టికెట్టు కూడా నేనే పుచ్చుకునేవాణ్ణి. నా ఆలోచన మేరకు ఇద్దరి ఇళ్లల్లోనూ చిల్లర డబ్బీలు ప్రారంభించాక కండక్టర్ దగ్గరనుంచీ ఎవరి టికెట్లు వాళ్లే పుచ్చుకుంటున్నాం.

మలకపల్లి తరువాత వచ్చే ఊళ్లో ఆ రోజేదో

సీటింగట. అందువల్ల ఒక్క సీటు కూడా ఖాళీ లేకుండా బస్సు నిండింది. పైగా స్టాండింగ్‌లో ఓ ఇరవైమంది ఉంటారు. చింతచెట్టు దగ్గర బస్సాపి కండక్టరు టికెట్లు కొట్టడం పూర్తి చేసి రైట్ చెప్పాడు. బస్సు కదిలింది. తరువాతి స్టేజిలోనే చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు ఎక్కారు. "చచ్చాంరా దేవుడా! ఇదో గంట లేటు!" అనుకున్నారంతా.

ఎం.ఇ.వోకి విజిట్ మామూలు ఎంత యాభై ఇస్తే మాత్రం, ఈ రోజైనా కాస్త ఎర్లీగా వెళ్లి ఉంటే బాగుండేది. అయినచేం, కుబేరుడు! ఏ మాస్టారు స్కూటరో ఎక్కి టైముకి దిగుతాడు అని నాలో నేనే అనుకున్నా. సుబ్బారావు వంక చూశా. తాపీగా కూర్చుని బస్సులో రాసిన స్లోగన్స్ - ఏమీ తోచక చదువుతున్నాడేమో, వాడి చూపులు 'తనిఖీ అధికారులు బస్సు ఎక్కడైనా ఆపవచ్చు. దయచేసి వారితో సహకరించండి!' అన్న అక్షరాలపై తిరుగుతున్నాయి.

వచ్చిన తనిఖీ అధికారులు ప్రతి పాసెంజరు వద్దకూ వెళ్లి ఒకరు టికెట్టు చూసమంటుంటే, ఇంకో ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆర్.తో ఆ టికెట్ నంబర్‌ని టాలీ చేస్తూ ముందుకు వెళ్తున్నారు. నేను నా టిక్కెట్టు ఇచ్చా. చూసి ఇచ్చేశారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావును టికెట్టు అడిగాడు.

సుబ్బారావు మొన్న ప్రొహిబిషన్‌లో బ్రాందీ సీసాతో పట్టుబడ్డవాడిలా ముఖం పెట్టి, "ఉందిలెండి, ఉంది!" అన్నాడు.

"ఉండడం కాదయ్యా, ఇలా ఇవ్వు! చూడాలి!" అన్నాడు అధికారి.

"టికెట్టు కొన్నానండీ! బాగులో ఉంది!" అన్నాడు సుబ్బారావు.

"తీయవయ్యా, బయటకి తీయ్!" స్వరం పెంచాడాయన.

"పీడూ, నేనూ ఇద్దరం ఒకేసారి టికెట్టు కొన్నామండీ! ఉంది, నిజం!" అని నన్ను చూపిస్తున్నాడు సుబ్బారావు.

"ఉంది ఉంది అంటావు .... తియ్యి బయటకి!" అని గద్దించాడు కండక్టరు.

ఇక తప్పదనుకుని సుబ్బారావు తన నల్లని జిప్‌బాగ్‌లోపల పక్కగా మరో అరకున్న సైడు జిప్ లాగి, "ఇందులో ఉంది!" అన్నాడు.

జిప్పు లాగబడిన, తెరుచుకున్న ఆ సైడ్ పాకెట్‌లోకి మన్నుతిన్న శ్రీకృష్ణుని నోట్లోకి యశోద తొంగిచూసినట్లు చూశాడు చెకింగ్ ఇన్‌స్పెక్టర్. బాపురే! ఇంకేముందీ .... పదునాలుగు భువనభాండాలు కాదు. ఆరు నెలలుగా, సెలవురోజులు తీసేసినా సరే సుమారు 150 రోజులు 300 పూటలు ప్రయాణించిన ఆర్టీసీ బస్సు టికెట్ల పరంపర! వందల సంఖ్యలో ప్రత్యక్షమైంది. అంటే మన సుబ్బారావుగారు తిరుమల తిరుపతి దేవస్థానం వారి హుండీలోకి కరెన్సీ నోట్లు వేస్తున్నట్లుగా రోజూ కండక్టర్‌గారిచ్చే టికెట్లన్నీ అతి జాగ్రత్తగా సైడ్ పాకెట్లో వేసి మరీ జిప్ వేస్తున్నారన్నమాట!

బాలెట్ బాక్స్‌లో నుంచి ఓట్ల కాగితాలు తీసినట్లుగా ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు సంచీలోనుంచి టికెట్లన్నీ తీసి కండక్టర్‌గారు కూర్చునే చతురస్రాకారంలో ఉన్న వైర్‌తో అల్లిన కేన్ సీటును పళ్లెంలా తిరగేసి అందులో కుప్పలు కుప్పలుగా పెడుతున్నాడు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్లిద్దరూ పని ప్రారంభించారు. పక్కన సహాయకులుగా కండక్టర్‌గారు.

ఒకరేమో కుప్పలో నుంచీ ఒక్కొక్క టికెట్టే తీసుకోవడం, మడత తీసి దాని నెంబరు గట్టిగా చదవడం, ఇంకో తనిఖీ అధికారి దాన్ని ఎస్.ఆర్.తో కంపేర్ చేస్తూ, "అది కాదు! అది కాదు!" అని అనడం ...

ఇలా జరుగుతోంది తనిఖీ.

కలగాపులగంగా కూరబడిన అన్ని టికెట్లలో ఆ పూట దేదో వాడికి మాత్రం తెలిసి చస్తే కదా! అందుకే సుబ్బారావు, ఆ టికెట్టును పట్టుకోవడం కోసం ఆర్టీసీ అధికారులు అవలంబిస్తున్న పద్ధతే సరైనదనుకుని లోలోపలే ఆనందిస్తున్నాడు.

'అబ్బే, అది కాదు' అని కొన్నిసార్లూ, 'కాదండీ!' అని కొన్నిసార్లు, ఇంకా నీరసించి కేవలం తల అడ్డంగా తిప్పుతూ, 'ఊహుం .... ఊహుం' అని కొన్నిసార్లు ఒక అధికారి అంటూంటే, లాటరీ టికెట్ల నంబర్లు తగలకపోతే కలిగే నిరాశకంటే రెట్టింపైన విరక్తితో టాలీ కానీ పాత టికెట్లన్నీ కింద పడేస్తున్నాడు ఇంకో ఇన్‌స్పెక్టర్.

మహిళలకు కేటాయించిన సీట్లలోనుంచి ఇద్దరు పిల్లలు ముద్దుముద్దుగా నడుచుకుంటూ వచ్చి కింద పడుతున్న టాలీ కాని టికెట్లన్నీ ఆనందంతో ఏరుకుంటూ, వాటిని పోగుజేసుకుని పడుకోబెట్టిన స్టెప్నీ టైర్ మీద కూర్చుని చీట్లాట ఆడుకుంటున్నారు.

ఇంతలో "781993!" అనగానే, "ఆ! ఇదే ఇదే! హమ్మయ్య .... దొరికింది! దొరికింది!" అని అరిచేశాడు తన నిజాయితీ రుజువైందన్న ఆనందంతో ఎస్.ఆర్. వైపు చూస్తున్న కండక్టర్.

చెకింగ్ ముగిసింది.

"ఇలాంటి శాల్తీ రోజుకొకటి దొరికితే చాలు. మనకు మెంటలాస్పత్రే ఖాయం!" అంటూ గొణుగుతూ బస్సు దిగాడో చెకింగ్ అధికారి.

"మనకీ రోజు ఎలాంటి 'టికెట్టు' దొరికిందండీ బాబూ!" అంటూ రైటు చెప్పాడు కండక్టరు.

"ఏం మ్యాత్రవయ్యా బాబూ! మమ్మల్ని ..." అంటూ ఓ చిన్న బూతుమాట విసిరేసి విసురుగా వచ్చి తన సీట్లో కూర్చున్నాడు డ్రైవరు.

ఒక స్టూడెంటనుకుంటాను. మనసులో బాగా రగిలిపోయాడో ఏమో, తీరా దగ్గరకి వచ్చేటప్పటికి మాస్టారని తెలియడంతో వినమ్రంగా చేతులు జోడించి, "ప్రయాణం ముగిశాక బస్సు దిగిన వెంటనే టికెట్టును చించి పారేయండి!' అనే స్లోగన్‌ని మీరు బస్‌స్టాండులో చదవలేదా మాస్టారూ!" అన్నాడు అతి వినయంగా కె. విశ్వనాథ్ సినిమాలోని హీరో స్టైల్‌లో.

"అది ఏలూరు బస్టాండులో చదివా! మా కొవ్వూరు బస్టాండులో లేదు!" అని సుబ్బారావు అమాయకంగా సమాధానం చెబుతూంటే ఆ కుర్రాడెక్కడ కొడతాడో అని నేనే మా సుబ్బారావును నా పక్కకు లాక్కున్నా.

ఈ విధంగా పాపం సుబ్బారావుని తలో మాటా అంటున్నారు. నేను సుబ్బారావుని ఏమీ అనలేదు. నాతో ఉన్నంతసేపే కాకుండా బళ్లో పిరియడ్ పిరియడ్‌కీ సుబ్బారావుని వాని తల్లిదండ్రులకిచ్చిన వాగ్దానం మేరకు కంటికి రెప్పలా కాస్తున్నానా! దానిల్లుగాలా! కండక్టరు ఇచ్చిన టికెట్టు కూడా ఎక్కడ పెట్టుకుంటున్నాడు అనే విషయాన్ని నేనెక్కడ పట్టించుకోనురా, రామా! అని నేను తల బాదుకుంటూ ఉంటే,

"తల నొప్పా, ఇదం, ఝండూ బామ్!" అని సీసా నాకందించే సుబ్బారావుని చూసి నవ్వాలో, ఏడవాలో తెలియక, "అఘోరించావులేవోయ్! ఇక దిగు, మలకపల్లి వచ్చేసింది!" అన్నాను కోపంగా.

'అయ్యో కసురుకుంటున్నానే' అని అనుకోగానే అదెందుకో కర్చీఫ్‌తో కన్నీళ్లు తుడుచుకున్నాక కానీ ముందుకు అడుగు వేయలేకపోయా.

■

## శ్రీకృష్ణ ప్రార్థన

నాటి పెళ్లాళింది నది నల్పు; తన్నదీ
జలబింబితం బాకసంబు నల్పు
కూలమందున్న తమాలజాలంబు నల్పు
పాప చేడెలు నల్పు
ఫణి ఫణాగ్రములపై నిల్చి తాండవమాడు
నీవు నల్పు
దిద్దిన కస్తూరి తిలకము నల్పు
శిరమున నెమలి పింఛము నల్పు
కోరి కోరి నల్పులే కోరుకున్న నీదు నామ
మొక పరి తెలిసి తిన్నగ జపియింప
రూపు మాసి నశించు నాలోని నల్పు
భక్తపాలక! గోపాలా! బాలకృష్ణా!

అరయున్ శంతను పుత్రుపై; విదురుపై;
నక్రూరుపై; గుబ్జపై,

నీరుపై, ద్రౌపదిపై, గుబేరుని పయిన్,
నందవ్రజశ్రేణిపై

ఒరగన్ గల్గు భవత్కృపారసము నాపై గొంత
రానిమ్ము

నీ చరణాబ్జంబులే నమ్మినాను జగదీశా! కృష్ణా!
భక్తప్రియా!

చెన్నూరి రామలక్ష్మి